క్లుప్తంగా

మైసమ్మతల్లికి కాంగ్రెస్ నేతల పూజలు



నర్సంపేట: నర్సంపేట నియోజకవర్గ ప్రజలు, రైతులు పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోటగండి మైసమ్మతల్లిని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, నర్సంపేట మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్‌లు దర్శించుకున్నారు. మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా శనివారం మైసమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రామోజీరావుకు నివాళి



రాయపర్తి(వర్ధన్నపేట): ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై జర్నలిస్టులు శనివారం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వర్ధన్నపేటలో రామోజీరావు చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆయా మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



పర్వతగిరి: మండలంలోని వడ్లకొండ గ్రామంలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కందికట్ల కొమురమ్మ రూ.5016 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ బాధ్యులు దాత కొమురమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాయపర్తి(వర్ధన్నపేట): ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరికి గాయమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గూడూరు వెంకటేశ్వర్లు తన ద్విచక్రవాహనంపై వర్ధన్నపేట పట్టణ శివారులో ఉన్న ప్రభుత్వ పాఠశాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అటుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టడంతో వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ ఆపకుండా వెళ్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

అమెరికా తెలుగు సభలో పాల్గొన్న ఎమ్మెల్యే



నర్సంపేట: అమెరికాలో జరిగే తెలుగు ప్రజల మహాసభకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమెరికాలో మూడు రోజుల పాటు జరుగుతున్న తెలుగు మహాసభల్లో అమెరికాలో స్థిరపడిన తెలుగు వారిని అభినందించారు. తెలంగాణ ప్రాంతంలోని పేద ప్రజలకు, ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోరారు.

చెట్టును తొలగించిన జెడ్పీ వైస్ చైర్మన్



దుగ్గొండి: మండంలోని వెంకటాపురం గ్రామసమీపంలో గిర్నిబావి–దుగ్గొండి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ పెద్ద చెట్టు నిత్యం ప్రమాదాలకు కారణమవుతోంది. చాలా మంది ఈ చెట్టు వల్ల రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. జెడ్పీటీసీ, జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ శనివారం తన సొంతఖర్చులతో దగ్గరుండి చెట్టును తొలగింపజేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ, హోంగార్డు రవి, గ్రామస్తులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడ: మండలంలోని గోవిందాపూర్‌లో గల గిరిజన సంక్షేమ మినీ గురుకులంలో చదువుకునేందుకు ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 30, రెండో తరగతిలో 2, 5వ తరగతిలో 4కాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య



నర్సంపేట : విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

నర్సంపేట: ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండల మానిటరింగ్ అధికారి కొర్ర సారయ్య అన్నారు. పట్టణంలో శనివారం బడిబాట కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పిల్లలకు కావాల్సిన సౌకర్యాల ఏర్పాటు పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తవుతాయని తెలిపారు. మధ్యాహ్న భోజనంతో పాటు పుస్తకాలు, దుస్తులు అందించడం జరుగుతుందన్నారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భిక్షపతి, అనిత, శైలజ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉజ్వల భవిష్యత్

పర్వతగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్‌బాబు సూచించారు. మండలంలోని నారాయణపురంలో శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే అన్ని రంగాల్లో ముందున్నారని తెలిపారు. సామాజిక కార్యకర్త సైకిలాబ్‌బాబు మాట్లాడుతూ దూర ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలకు తమ పిల్లలను పంపే క్రమంలో ఉదయం 7 గంటలకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు రావడంతో వారు చేసే ప్రయాణంలో మానసిక ఒత్తిడికి గురవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, సంపత్, అరవింద్‌కుమార్, ఎస్.గిరిజ, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



పర్వతగిరి : ప్రచారంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

జనగామకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలి



ఉపాధ్యక్షుడిని అభినందిస్తున్న రమేశ్‌గౌడ్

నర్సంపేట: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ పేరు పెట్టాలని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం శనివారం పట్టణ అధ్యక్షుడు గండి గిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసినందున జనగామ జిల్లాకు కాంగ్రెస్ తమ ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించిన విధంగా సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ పేరు పెట్టేందుకు జీఓ జారీ చేయాలన్నారు. గతంలో మునుగోడు ఉపఎన్నికల్లో టీఆర్‌ఎస్ ప్రభుత్వం గౌడ ఆత్మీయ సమావేశంలో గీత కార్మికులకు సేఫ్టీ మోకులు, మోపెడ్‌లు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇచ్చిన హామీ నెరవేరుస్తుందనే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 12 శాతం ఉన్న గౌడ కులస్తులు రాజకీయాలకతీతంగా కాంగ్రెస్‌కు ఓట్లు వేసి గెలిపించారని తెలిపారు. తాడి కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం మోకుదెబ్బ పట్టణ ఉపాధ్యక్షుడిగా శివకోటి గౌడ్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గంప రాజేశ్వర్‌గౌడ్, మద్దెల సాంబయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గండి గిరి, ఉపాధ్యక్షుడు గుండెబోయిన శివకోటి, దుగ్గొండి మండల అధ్యక్షుడు తడుక కొమురయ్య, ఉపాధ్యక్షుడు గుండెబోయిన రమేష్, గౌడ సంఘం సీనియర్ నాయకులు బొమ్మగాని సదానందం, పానకల్ గౌడ సంఘం అధ్యక్షుడు పిల్లల సురేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు బండి రాజయ్య, రవీందర్, రాజయ్య పాల్గొన్నారు.

ఇంటివద్దే వైద్యసేవలు



సంగెం: వయోవృద్ధులకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందించేందుకు కేంద్ర సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్, సీనియర్ సిటిజన్స్ ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బీకోజీనాయక్ తండాలో హన్మకొండ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొబైల్ మెడికేర్ యూనిట్ వారు వృద్ధులకు బీపీ, షుగర్ రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. మండల బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సపావట్ మహేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలి



మెడికల్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట : నర్సంపేటలో మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిద్ధు, పీడీఎస్‌యూ నాయకులు విజయ్, ఏఐఎఫ్‌డీఎస్ నాయకుడు శ్యామ్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, ఆర్‌డీఓ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి సంబంధిత భవన నిర్మాణశాఖ, కాంట్రాక్టర్లకు ఈ విద్యాసంవత్సరానికి అందేవిధంగా చూడాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కానీ కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే కలెక్టర్ స్పందించి మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి 2024–25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ భవనం ప్రారంభమయ్యే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో చింతం సిద్ధు, ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాగౌడ్ ఆశయసాధనకు కృషి చేయాలి



నివాళులర్పిస్తున్న ఎంసీపీఐ(యూ)నాయకులు

సంగెం: ఎంసీపీఐ(యూ) సీనియర్ నాయకుడు నారగోని ఎల్లాగౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి అన్నారు. మండలంలోని ఎల్గూర్‌రంగంపేటలో శనివారం ఎల్లాగౌడ్ సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లాగౌడ్ సమాజంలోని సమస్యలపై స్పందించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మరణానంతరం అవయవదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇస్మాయిల్, ఐక్య ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, జిల్లా కమిటీ సభ్యులు కందికొండ కుమారస్వామి, జక్క అశోక్, కుమారస్వామి, మండల అయిలయ్య, నారగోని సాంబయ్య, యాదగిరి, యుగేంధర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపుతో సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

సంగెం: వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపొందడంతో మండలంలో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బాణసంచాకాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, యూత్ అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు జగన్నాథాచారి, వెంకటయ్య. కోటేశ్వర్, నర్సింహనాయక్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

పరకాల : పూర్వవిద్యార్థుల సమ్మేళనాలు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకోవడంతో పాటు గురువుల గౌరవాన్ని చాటిచెబుతున్నాయి. పట్టణంలో ఒకప్పుడు ప్రముఖ విద్యాసంస్థగా పేరుగాంచిన సీఎస్ఐ మిషన్ ఉన్నత పాఠశాలలో 1979–80 సంవత్సరానికి చెందిన పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. చిన్నప్పుడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని సంతోషంగా గడిపారు. ఉన్నత చదువులతో దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడి నేడు చిన్న నాడు చదువుకున్న పాఠశాల వేదికగా 44 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు హైదరాబాద్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ సూపరింటెండెంట్ విన్సంట్ విజయ్‌కుమార్, సీనియర్ జర్నలిస్టు శ్రీనివాస్ అన్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.జీ థామస్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు డీ.రవికుమార్, ఎంఎస్‌మూర్తి, ఎస్.నాగేశ్వర్‌రావు, ఎస్.సురేష్‌కుమార్, పి.రామారావు, బి.ప్రేమ్‌సాగర్, బి.ఆనందరావు, ఎం.స్వరూప, డి.కృప, ఎం.సుగు,ఆర్.ఎస్తేర్, ఎం.విమల, వజ్ర పాల్గొన్నారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రంలో దోపిడీ

- విక్రయించిన మొత్తం ధాన్యానికి డబ్బులు చెల్లించని నిర్వాహకులు
- రాంపూర్‌లో నిలదీసిన రైతులు
- పెద్దమనుషుల సమక్షంలో రాజీ





రాంపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులను నిలదీస్తున్న రైతు

నల్లబెల్లి: ఈ ఫొటోలో కనిపిస్తున్నది నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్ శివారు గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు మేరుగు సాంబయ్య. పండించిన 298 బస్తాల ధాన్యాన్ని రాంపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. నిర్వాహకులు అక్రమాలకు పాల్పడి 290 బస్తాలకు సంబంధించిన డబ్బులు మాత్రమే జమచేశారు. మిగిలిన 8 బస్తాల డబ్బులు నిర్వాహకులు తమకు అనుకూలమైన రైతు బ్యాంకు ఖాతాలో వేశారు. విషయాన్ని గమనించిన సాంబయ్య నిర్వాహకులను నిలదీయడంతో డబ్బులు చెల్లిస్తామని రాజీ కుదుర్చుకున్నారు. ఈ సమస్య ఇతడిది ఒక్కడిదే కాదు.. రాంపూర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి రైతులందరిది. 40 మందికి దోపిడీ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. నిర్వాహకులు సుమారు 100 మంది రైతుల నుంచి 6 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ధాన్యాన్ని మిల్లులకు తరలించి సకాలంలో రైతులకు డబ్బులు అందించాలి. రైతులకున్న నమ్మకాన్ని వమ్ముచేస్తూ నిర్వాహకులు ధాన్యం బస్తాలను తగ్గించారు. అక్రమాలకు పాల్పడి మిగిలించుకున్న ధాన్యం బస్తాలను అనుకూలమైన రైతుల పేరుతో మిల్లులకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన రైతులు నిలదీయడంతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నం చేశారు. ఒకరు ఇద్దరు కాదు ఏకంగా 40 మందికి పైగా రైతులను దోపిడీ చేశారు. రైతులు పెద్ద మనుషులను ఆశ్రయించారు. జరిగిన దోపిడీ గురించి నిలదీశారు. తప్పు జరిగిందని ఒప్పుకున్న నిర్వాహకులు దోపిడీ చేసిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను చెల్లించేందుకు అంగీకరించారు.

100 బస్తాల్లోపు కాంటా పెట్టిన రైతులకు నిర్వాహకులు దోపిడీ చేసిన మొత్తం బస్తాలు ఇవ్వాలని నిర్ణయించారు. 100 బస్తాలకు పైగా కాంటా పెట్టిన రైతుల నుంచి ఐదు బస్తాలు దోపిడీ చేస్తే.. నిర్వాహకులు రైతుకు మూడు బస్తాలు మాత్రమే ఇచ్చేలా ఇరువురి పెద్దలు ఈ నెల 2వ తేదీన తీర్మానం చేశారు. ఈ విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అధికారులు స్పందించి ధాన్యాన్ని దోచుకున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాయించుకున్న తీర్మానపత్రం

రేలకుంటలో ప్రభుత్వ స్థలం కబ్జా



కబ్జాకు గురైన స్థలం

నల్లబెల్లి: మండలంలోని రేలకుంటలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైంది. గతంలో ఈ స్థలంలో పశువుల ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉండగా అధికారులు కూల్చివేశారు. ఈ స్థలంతోపాటు భూదాన్ భూమి, చెరువు శిఖం భూములను అదే గ్రామానికి చెందిన కొందరు పట్టాలుగా మార్చుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేలకుంటలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. దీంతో కబ్జాల పర్వం ఎక్కువైంది. మరోపక్క ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమణలకు గురికాకుండా సర్వే చేయించాల్సిన రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

రేలకుంటలో పశువుల ఆస్పత్రి స్థలం, భూదాన్ భూములు, చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయని ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు వెళ్లాయి. సంబంధిత అధికారులు మాత్రం భూములను సర్వే చేయించి గుర్తించడం లేదు. ఇప్పటికే హద్దురాళ్లు ఏర్పాటు చేసుకొని తన స్వాధీనంలో ఉంచుకోగా, మరికొందరు సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వే చేపడతాం



రేలకుంటలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు సర్వే చేయిస్తాం. విచారణ చేపట్టి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కబ్జాలకు గురికాకుండా చూస్తాం.

– రాజేశ్, తహసీల్దార్, నల్లబెల్లి

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



పర్వతగిరి: మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్ గ్రామ కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త కత్తుల కట్టయ్య శనివారం మృతి చెందాడు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కట్టయ్య భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కల్లెడ, గోపనపల్లి, అనంతారం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన రావుల వీరయ్య, రజిత, సాయిలు, పుష్పలత కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్ నిమ్మాని శేఖ ర్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు ఉన్నారు. మండలంలోని ఇస్లావత్‌తండా గ్రామ మూడో వార్డు సభ్యుడు ఇస్లావత్ రవీందర్ తల్లి మంగమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మాజీ సర్పంచ్ ఇస్లావత్ రమేశ్‌నాయక్ శనివారం పరామర్శించారు.

నల్లబెల్లి: మండలంలోని రుద్రగూడెం గ్రామంలో ఈర్ల శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి శనివారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు తడుక వినయ్, బచ్చు వెంకన్న, యువమోర్చా మండల అధ్యక్షుడు సుదగాని ప్రమోద్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



చెన్నారావుపేట: నివాళులర్పిస్తున్న మెపా రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్

చెన్నారావుపేట: మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన మెపా జిల్లా కమిటీ సభ్యుడు తాడెం దేవేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మెపా రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి దండు చిరంజీవి, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, రాజేష్, ఉపేందర్, కొంరయ్యలు ఉన్నారు.

మండలంలో చేపలకు భలే గిరాకీ



సంగెంలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

సంగెం: మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపలకు భలే గిరాకీ పెరిగింది. తరతరాలుగా మృగశిరకార్తె రోజున తప్పకుండా చేపలు తినాలనేది ప్రజల నమ్మకం. దీంతో మండలంలోని పలు చెరువుల్లో మత్స్యకారులు చేపలవేటకు దిగారు. ఇతర మండలాల్లోని చెరువుల నుంచి చేపలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. మండల కేంద్రంలో శనివారం మత్స్యకారులు పట్టిన చేపలను చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో చేపలకు కిలోకు రూ .150 ఉండగా మృగశిర కార్తెను పుస్కరించుకుని రూ.200 వరకు అమ్మకాలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తగూడ: నేడు ఆదివారం కొత్తగూడ, గంగారం మండలాలకు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలినివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేష్ తెలిపారు. లక్నెపెల్లి నుంచి మండలానికి వచ్చే 33కేవీ విద్యుత్ లైన్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని కొండపర్తి, వెంకటాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపు, లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పద్మ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ కనెక్షన్‌లు, కొండపర్తి గృహ అవసరాల వినియోగదారులకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.